

రైతులకు పెట్టుబడి సాయం

- రైతు భరోసా నిధులను కర్షకుల ఖాతాల్లో జమ చేస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాల రైతులకు రూ.8.35 కోట్లు
- జిల్లాలో 3.26 లక్షల మంది అర్హులైన రైతులు
- విడతల వారీగా రైతులకు పెట్టుబడి సాయం నిధులు
- సాగుకు యోగ్యంలేని భూములు 7500ల ఎకరాలు

కామారెడ్డి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల్లో రైతుభరోసా ఒకటి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పంటలసాగులో రైతులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గణతంత్ర దినోత్సవం నుంచి రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులను జమ చేస్తోంది. మొదటి విడత కింద జిల్లాలో ఎంపిక చేసిన 22 గ్రామాల్లోని అర్హులైన రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులను ప్రభుత్వం వేసింది. ఇదే మాదిరిగా విడతల వారీగా రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 33.26లక్షల మంది రైతులు రైతు భరోసాకు అర్హులుగా గుర్తించారు. అదేవిధంగా 7500ల ఎకరాలు సాగుకు యోగ్యంగా లేవని అధికారులు లెక్క తేల్చారు.

జిల్లాలో 3.26 లక్షల మంది అర్హులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో మొత్తం 104 వ్యవసాయ క్లస్టర్‌లు ఉన్నాయి. ఈ క్లస్టర్‌ల పరిధిలో మొత్తం 5,15,920 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. ఇటీవల నిర్వహించిన సర్వేలో సుమారు 7500ల ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 5,08,300ల ఎకరాల వరకు సాగుకు అనుకూలంగా భూములు ఉన్నట్లు తేలింది. వీటి పరిధిలో 3.26 లక్షల మంది పట్టాదారులు రైతులు ఉన్నారు. వీరందరు రైతు భరోసాకు అర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం విడతల వారీగా పెట్టుబడి సాయం నిధులను జమ చేయనుంది.

మొదటి విడత కింద రూ.8.35కోట్లు జమ

రైతులకు పెట్టుబడి సాయం కోసం రైతుభరోసా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పెట్టుబడి సాయం నిధులను ప్రభుత్వం విడతల వారీగా జమ చేయనుంది. అయితే గణతంత్ర దినోత్సవం సందర్భంగా మొదటి విడతలో జిల్లాలో ఎంపిక చేసిన 22 గ్రామాల పరిధిలోని 13,917 ఎకరాలకు రూ.8.35 కోట్లను విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేసింది. నేటి నుంచి ఎకరాల చొప్పున పెట్టుబడిసాయం నిధులను విడుదల చేయనున్నారు. జిల్లాలో 0 నుంచి 1 ఎకరం వరకు ఉన్న రైతులు 1,30,670 ఉన్నారు. 1 నుంచి 2 ఎకరాల వరకు 31,796 మంది, 2 నుంచి 3 ఎకరాల వరకు 48,947 మంది, 3 నుంచి 4 ఎకరాల వరకు 26,734 మంది రైతులు, 4 నుంచి 5 ఎకరాల వరకు 15,800ల మంది రైతులు, 5 నుంచి 10 ఎకరాల వరకు 11,265 మంది రైతులు, 10 ఎకరాలపైన 1493 మంది రైతులు ఉన్నారు.

7500ల ఎకరాలకు రైతుభరోసా కట్

జిల్లాలోని 25 మండలాల పరిధిలో సుమారు 7500ల ఎకరాల వరకు సాగుకు యోగ్యం కాని భూములుగా వ్యవసాయ, రెవెన్యూ శాఖలు ఇటీవల సర్వేలో గుర్తించాయి. అయితే ఈ భూములకు గత ప్రభుత్వంలో రైతుబంధు కింద పెట్టుబడి సాయం నిధులను జమచేస్తూ వచ్చింది. పంటలు సాగులో లేనప్పటికీ ఆ భూములకు నిధులు కేటాయించడంతో ప్రజాధనం వృథా అయిందని గుర్తించారు. దీంతో 7500ల ఎకరాలు సాగుకు యోగ్యంగా లేకపోవడంతో వాటిని రైతుభరోసా జాబితా నుంచి ప్రభుత్వం తొలగించింది. అర్హులైన 3.26లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందజేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కష్టపడి చదివి ఉన్నత స్థానాలను పొందాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివి ఉన్నత స్థానాలను పొందాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం, స్పోర్ట్స్‌డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు కష్టపడి ప్రతిరోజూ చదవాలని, పరీక్షలకు కేవలం 30 రోజుల వ్యవధి మాత్రమే ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య కోసం మంచి ఆలోచనలతో కోర్సులను ఎంపిక చేసుకోవాలని, లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా సాగాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని 20 ప్రభుత్వ కళాశాలల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు జేఈఈ వంటి పరీక్షల్లో సీటు సాధించేందుకు కోచింగ్ తరగతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆన్‌లైన్ తరగతుల ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే కోచింగ్ తరగతులు నిర్వహించుటకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కోచింగ్‌లో హాజరయ్యే అవకాశం కల్పించుకోవాలని తెలిపారు. దాతల సహకారంతో కళాశాలకు అవసరమైనవి సమకూర్చుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం, ప్రిన్సిపాల్ జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 ఫిబ్రవరి 2025 నుంచి 22 ఫిబ్రవరి 2025 వరకు 48 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు, 5 మార్చి 2025 నుంచి 25 మార్చి 2025 వరకు 38 కేంద్రాల్లో థియరీ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు బస్సు సౌకర్యంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌టీసీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, డీపీవో శ్రీనివాసరావు, డీఈవో రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అక్రమ మొరం తరలింపు చేపట్టిన స్థలాన్ని ముగ్గు వేసి సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నసురుల్లాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రషర్ పక్కన నుంచి మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ సాయిలు అన్నారు. నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామ పరిధిలో గల క్రషర్ ప్రాంతంలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మొరం అక్రమ రవాణా' అనే శీర్షికకు అధికారులు స్పందించారు. ఆ ప్రాంతాన్ని అదుపులోకి తీసుకొని, ప్రతిరోజూ ఇద్దరు రెవెన్యూ సిబ్బందిని అక్కడ కాపలా ఉంచుతామని ఆర్‌ఐ తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ సిబ్బంది మొరం తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని అదుపులోకి తీసుకుని ముగ్గు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా అక్రమ మొరం తవ్వకాలు చేపడితే రెవెన్యూ, పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. తవ్వకాలు చేపట్టే టిప్పర్, జేసీబీలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు బుక్ చేస్తామన్నారు.

పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దు

జిల్లా మానసిక వైద్యాధికారి రమణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణ

కామారెడ్డి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోను కావద్దని జిల్లా మానసిక వైద్య అధికారి రమణ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్‌లో గల కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఒక ప్రణాళిక బద్ధంగా రూపకల్పన చేసుకుని సమయానుకులంగా చదువుకోవాలని తెలిపారు. టీనేజీ వయసులో వచ్చే అవరోధాలను అధిగమించాలని, మొబైల్‌ఫోన్లకు బానిస కావద్దని, కుటుంబ ఆర్థిక సమస్యల పట్ల ఒత్తిడికి లోనుకావద్దని తెలిపారు. తమ లక్ష్యాలను ఏర్పరుచుకుని చదువుకోవడానికి ఒక వాతావరణాన్ని సృష్టించుకోవాలన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయితే మరొక్క అవకాశం ఉంటుందని తొందరపడి ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో టెలిమానస్ సేవలను ఉపయోగించుకోవాలని నిరంతరం వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. టెలిమానస్ ఉచిత టోల్‌ఫ్రీ నెంబర్ 14416ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి లావణ్య, సోషల్‌వర్కర్ రాహుల్, ఆరోగ్యకార్యకర్త సుజాత, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మీ, స్వప్న, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అల్లమా ప్రభు జాతర

- బొమ్మన్‌దేవునిపల్లిలో అల్లమా ప్రభు జాతర
- మూడు రోజులు కొనసాగుతున్న జాతర
- జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు

7





నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

రూ.100 కోట్లతో ఉపాధి పనులు పూర్తి

- డీఆర్‌డీవో సురేందర్

నాగిరెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను కామారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సుమారు వంద కోట్ల రూపాయలతో ఉపాధిహామీ పథకం ద్వారా వివిధ రకాల పనులు పూర్తి చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) సురేందర్ తెలిపారు. ఆయన మంగళవారం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించిన 15వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లాలో రూ.100 కోట్లతో ఉపాధిహామీ పనులు పూర్తి చేయగా అందులో రూ.73కోట్ల 69లక్షలతో ఉపాధిహామీ కూలీల ద్వారా పనులు జరిపించినట్లు ఆయన తెలిపారు. అలాగే మెటీరియల్ కాంపొన్నెంట్ ద్వారా రూ.19 కోట్లతో వివిధ రకాల పనులు జరిపించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు ఉపాధిహామీ ద్వారా ఒక లక్షా 10,903 కుటుంబాలకు పనులు కల్పించినట్లు తెలిపారు. 37లక్షల 97వేల 903 పని దినాలను కల్పించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 551 కుటుంబాలకు వంద రోజుల పనులు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ ద్వారా ప్రజలకు గ్రామానికి ఉపయోగకరంగా ఉండేలా ఫార్మేషన్ రోడ్లు, పామ్‌పండ్ తదితర పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఉపాధిహామీ ద్వారా చెరువుల్లో, కుంటల్లో పూడికతీత పనులు అధికంగా జరిగేవని, ప్రస్తుతం చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదని ఆయన తెలిపారు. ఉపాధిహామీ పనులు చేసిన కూలీలకు 15 రోజుల్లో డబ్బులు చెల్లించేలా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధిహామీ సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలు రావాల్సిందని ఆయన తెలిపారు. మండల కేంద్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ ద్వారా మూడు కోట్ల 10లక్షల రూపాయల వ్యయంతో 130 పనులు జరిపినట్లు తెలిపారు. దీనికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రత్నం, ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఉపాధిహామీ ఏపీవో సాయిలు, ఎస్‌ఆర్‌పీ తిరుపతి, ఉపాధిహామీ సిబ్బంది, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల్లో నాణ్యత లేమి

- ఇష్టారాజ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్‌హోంలు, క్యాటరింగ్‌ల నిర్వహణ
- నిల్వ చేసిన మాంసం, పదార్థాలు, అపరిశుభ్రమైన వాతావరణంలో వంటకాలు
- ఇటీవల జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల్లో ఫుడ్‌సేఫ్టీ, మున్సిపల్ అధికారుల తనిఖీలు
- పలు దుకాణాలకు జరిమానా



ఇటీవల హోటల్‌లో తనిఖీలు చేపడుతున్న అధికారులు

కామారెడ్డి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో హోటళ్లు, ఫంక్షన్‌లకు క్యాటరింగ్ చేసే ప్రాంగణాలు, రెస్టారెంట్లు, స్వీట్‌హోంలే, ఐస్‌క్రీం పార్లర్‌లతో పాటు అన్ని తినుబండరాల దుకాణాలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. నిల్వ చేసిన పదార్థాలతో, సమయం మించిపోయిన, కల్తీ నూనెలతో వంటకాలు చేస్తూ నిర్వాహకులు ఫంక్షన్‌లకు, స్వీట్ దుకాణాలకు వచ్చిన ప్రజలకు అందజేస్తు ప్రాణాలతో చెలగాట మాడుతున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. చాలా చోట్ల హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ చేసే వంట గదులు కంపు కొడుతున్నాయి. దీర్ఘకాలికంగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు గాని, మున్సిపల్ అధికారులు గాని కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్న సమయంలో దాడులు నిర్వహిస్తుంటే ఎవరో ఒకరి నుంచి ఒత్తిళ్ల రావడంతో అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడం లేదు. ఫిర్యాదు రాగానే తూతూ మంత్రంగా తనిఖీల పేరుతో అప్పుడప్పుడు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చుట్టం చూపులా వచ్చి వెళుతూ శాంపిళ్ల సేకరణతోనే సరిపెడుతుండడంతో వ్యాపారుల నిర్లక్ష్యం మితిమీరిపోతుందని సమాచారం. హోటళ్లు, బార్, ఫ్యామిలీ రెస్టారెంట్లు, ఫుట్‌పాత్ తినుబండరాల వ్యాపారాలు తమకు నచ్చిన విధంగా ప్రవర్తిస్తు ప్రజల ఆరోగ్యానికి ఎసరు తెస్తున్నారు. కొన్నిచోట్ల నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తు, సమయం మించిపోయిన కూల్ డ్రింక్, రోజుల తరబడి నిల్వ ఉంచిన పదార్థాలతో వంటలు చేస్తుండడంతో ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోంది. ఇటీవల పలు స్వీట్‌హోంలను తనిఖీ చేసిన అధికారులకు అపరిశుభ్రత, నిబంధనలు పాటించకపోవడంతో రూ.12వేల వరకు జరిమానాలు విధించారు. గతంలోనూ కొన్ని క్యాటరింగ్ నిర్వాహకుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టి వారికి జరిమానాలు విధించినా మళ్లీ అదే అపరిశుభ్రతలో వంటకాలు చేస్తు ఫంక్షన్‌లకు పంపిస్తున్నారు. వీటిని తిన్న ప్రజలు 24 గంటల పాటు కడుపు నొప్పి, మలబద్ధకం లాంటి సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

నాణ్యత ప్రమాణాలకు మంగళం

రెస్టారెంట్లు, హోటళ్ల ఐస్‌క్రీం పార్లర్‌లు, స్వీట్ హోంలు, బార్‌లు, ఫాస్ట్‌ఫుడ్, బేకరి, మిర్చి, గప్‌చుప్ బండ్ల వరకు కనీస నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదు. రెస్టారెంట్లు, హోటళ్ల వంట గదులు కంపుకొడుతున్నాయి. రోజంతా వినియోగించిన నూనె చల్లారిన తర్వాత తిరిగి వాడరాదనే నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. పలు మిర్చి దుకాణాలు, పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకుల తీరుతో ఆరోగ్యం దెబ్బ తింటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక మటన్, చికెన్ అమ్మకం సమయంలో జీవాలు ఆరోగ్యవంతంగా ఉన్నాయా లేదా అని పశుసంవర్ధక శాఖ వైద్యులు పరిశీలించిన తర్వాతనే అమ్మకాలు జరపాలి. కానీ పలువురు అవేమి పట్టించుకోకుండా ధనర్జానే ధ్యేయంగా ప్రజ ల ఆరోగ్యాలతో ఆటలు ఆడుకుంటున్నారనే ఆరోప ణలు వస్తున్నాయి. గతంలో కామారెడ్డి డైలీ మార్కెట్ ప్రాం తంలో ఓ మటన్, చికెన్ సెంటర్‌లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి కంపుకొడుతున్న మాంసాన్ని, సమ యం మించిన కూల్ డ్రింక్‌లను, పదార్థాలను స్వీట్‌హోమ్‌లలో మున్సిపల్ అధికారులు గుర్తించి భారీ జరిమానాలు సైతం విధించారు.

మిగిలిన మాంసంతో వంటకాలు

మిగిలిపోయిన మటన్, చికెన్, ఇతర తినుపదార్థాలను డీఫ్రిజ్‌లో నిల్వచేస్తూ మరుసటి రోజు అమ్మకాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రంగులను కలుపుతూ కేన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతకమైన రోగాలకు కారణమవుతున్నారు. కొంత మంది యజమానులు ట్రేడ్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండానే హోటళ్లను యథేచ్ఛగా నడిపిస్తున్నారు. మరికొందరైతే మాంసం విక్రయాలు చేసే వారితో బేరం కుదుర్చుకుని రోగంతో చనిపోయిన, గాయాలపాలైన వాటిని సైతం తక్కువ ధరకు తీసుకువచ్చి వంటలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ అధికారులు మాత్రం ఫిర్యాదులు అందితే స్పందిస్తూ జరిమానాలు విధిస్తుండగా ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌లు మాత్రం అడపాదడప తనిఖీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నపిల్లలు కల్తీ ఆయిల్‌తో చేసిన పదార్థాలు, నిల్వ ఉంచిన పదార్థాలను తిని డయోరియా భారిన పడుతున్నారు. చాలా వరకు గ్యాస్ట్రిక్ సమస్యతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరికి నాన్ ఆల్కాహలిక్ ఫ్యాటీ లివర్ సమస్యలు తలెత్తుతున్నాయి.

అధ్వానంగా శానిటేషన్

శుభ్రత విషయంలోనూ మాంసం విక్రయ కేంద్రా లు, హోటల్, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. టేబుళ్లను క్లీన్ చేసే సమయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్లేట్లు, గ్లాసులను రెండు బకెట్లలో ముంచేసి శుభ్రం చేయడంతోనే పనికానిచ్చేస్తున్నారు. పరిశుభ్రతపై అనేక హోటళ్లలో చిన్నపాటి గొడవలు జరుగుతునే ఉన్నాయి. గతంలో అధికారుల తనిఖీల్లో ఇవ్వన్నీ కనిపిస్తున్నా చర్యలు మాత్రం నామ మాత్రంగానే ఉన్నాయి. ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో అనేక సార్లు పట్టుబడినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్నది లేదు. శాంపిళ్ల సేకరణలో తప్పని తేలితే జరిమానా, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని దుకాణ యజమానులను, వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకుండా నీరుగార్చే ప్రయత్నాలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడితే ఆయా తినుబండరాల కేంద్రాల్లో ఉన్న అధ్వానమైన శానిటేషన్ పరిస్థితులు బట్టబయలవుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అధికారంలో లేకున్నా రూ.2కోట్ల నిధులు మంజూరు చేశా

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్‌లో ఇండోర్ స్టేడియానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, జనవరి28(ఆంధ్రజ్యోతి): తాము అధికారంలో లేకున్నప్పటికీ అప్పటి రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ద్వారా రూ.2కోట్లు పైచిలుకు మంజూరు చేశానని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకనప్పటికీ అభివృద్ధి నిధులు తీసుకురావడం కష్టమవుతున్న తరుణంలో మాజీఎంపీ తన స్నేహితుడు సంతోష్‌కుమార్‌ను అడగగానే వేల్పూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు రూ.2కోట్ల పైగా నిధులు ఇచ్చారన్నారు. రూ.35లక్షలతో మినీస్టేడియంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి, రూ.25లక్షలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు గది, పాఠశాల మరమ్మతులు, రూ.25లక్షలతో స్థానిక ముదిరాజ్ సంఘ భవనానికి సంబంధించి శంకుస్థాపన చేయడం చేశామన్నారు. రూ.కోటి 25లక్షలు ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి, రూ.5లక్షలతో చర్చి గ్రీవీయార్డ్ కంపౌండ్ నిర్మాణానికి, రూ.2లక్షలతో ముస్లిం అంజుమాన్ కమిటీ మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంజరిగిందన్నారు. ఈ నిధుల మంజూరు చేసిన మాజీఎంపీ సంతోష్‌కుమార్‌కు వేల్పూర్ గ్రామప్రజల తరపున ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, ఎంఈవో రేణుక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, నాయకులు రేగుల్ల రాములు, మిట్టపల్లి మహిపాల్, ప్రతాప్‌రెడ్డి, డోల్ల రాజేశ్వర్, సౌడ రమేష్, నితీష్ కుమార్,రాజ్‌కుమార్,దయాకర్, డాక్టర్ మారుతి, అధికారులు,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

● పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరణ

వేల్పూర్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం వేల్పూర్ మండల ఉపాధ్యాయ యూనియన్ పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్‌లను పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బోడ దేవనందం, నర్సింహ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రేణుక, పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్. కాంతయ్య, అంభుజరాణి, విజయ్, ఉపాధ్యక్షుడు రవీందర్, రాజేందర్‌గౌడ్, సురేష్, కార్యదర్శి దత్తప్రసాద్, చంద్రదేవ్, జిల్లా కార్యదర్శి నంబి శ్రీనివాస్, మండల మహిళ ఉపాధ్యక్షురాలు శైలజ, నాయకులు గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డి46 కెనాల్ తూములో రాళ్లను తొలగించాలని రైతుల ఆందోళన



తుబ్బాతాండలోని డి46 కెనాల్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎడపల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ డి46 కెనాల్ నుంచి ఎడపల్లి పెద్ద చెరువులోకి నీరు వచ్చే తూములో కొందరు కావాలని బండరాళ్లు అడ్డు పెట్టి ఎడపల్లి పెద్ద చెరువులోకి నీరు రాకుండా చేశారంటూ మంగళవారం ఎడపల్లి పెద్ద చెరువు ఆయకట్టు రైతులు డి46 కెనాల్ తూము వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతు, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎడపల్లి పెద్ద చెరువులోకి నిజాంసాగర్ డి46 కెనాల్ నుంచి నీరు వచ్చే తూములో కొందరు కావాలనే బండరాళ్ళు పెట్టి చెరువులోకి నీళ్ళు రాకుండా చేస్తున్నారని, ఇది శిఖం భూమి కబ్జా చేస్తూ పంట పండిస్తున్న వారి పనేనని, చెరువులోకి నీరు వస్తే కబ్జా చేసిన శిఖం భూమిలో నాటు వేసిన వరిపంట మునిగి పోతుందనే ఉద్దేశ్యంతోనే తూములో బండరాళ్లు వేసి చెరువులోకి నీళ్లు రాకుండా చేశారని, చెరువుకు నీరు వచ్చే కాలువను సైతం కబ్జా చేసి కాలువను పూడ్చారని రైతులు ఆరోపించారు. ఇప్పటి వరకు రెండు దఫాలుగా నిజాంసాగర్ నీళ్ళు వదిలినా ఒక్క నీటి చుక్క కూడా చెరువులోకి రాలేదని ఆయన అన్నారు. ఎడపల్లి పెద్ద చెరువు ఆయకట్టు దాదాపు 360 ఎకరాలు ఉందని ఇప్పటికే చెరువులో నీరు సగానికి పైగా తగ్గిందని ఇక ముందు కూడా ఇలానే జరిగితే ఆయకట్టులో వేసిన వరిపంట పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత ఇరిగేషన్ డీఈకి ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి వస్తానని రైతులు అక్కడే ఉండాలని తెలుపగా సాయంత్రం 4 గంటల వరకు వేచి ఉన్నామని అయినా అధికారులు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి తూములో అడ్డు గా వేసిన బండరాళ్లను తొలగించి పూడ్చిన వాలువను తీయించి చెరువులోకి నీళ్లు వచ్చేలా చూడాలని రైతులు తెలిపారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆయకట్టు రైతులతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి పెద్ద చెరువు ఆయకట్టు రైతులు కంచరి శ్రీనివాస్, బర్దిపూర్ విఠల్, అల్లడి శ్రీనివాస్, జక్కలి నాగేష్ తదితరులు ఉన్నారు.

● డీ50/10/5 ఉప కాలువకు అందని సాగునీరు

నవీపేటననరకరక: మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో ఉన్న పంటలకు అలీసాగర్ ఆయకట్టుకు చెందిన డీ50/10/5 ఉప కాలువ ద్వారా చుక్క సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో సాగునీటిని విడుదల చేసి నెల రోజులు దాటిన ఇప్పటికి సంబంధిత ఉప కాలువ ద్వారా ఆయకట్టుకు నీరు అందలేదని రైతులు పేర్కొన్నారు. సాగునీరు అందకపోవడంతో సుమారు 200ఎకరాలలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వెంటనే ఆయకట్టుకు సాగునీరు అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డిని వివరణ కోరగా అలీసాగర్ డీ50/10/5 ఉప కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు ముందుండాలి

● జిల్లా అడిషనల్ కలెక్టర్, బోధన్ మున్సిపల్ ప్రత్యేక అధికారి అంకిత్



బోధన్ మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న మున్సిపల్ ప్రత్యేక అధికారి అంకిత్

బోధన్‌రూరల్,జనవరి28(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సంసిద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్, బోధన్ మున్సిపల్ ప్రత్యేక అధికారి అంకిత్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా ప్రత్యేక అధికారి హోదాలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డులను ఆయన పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పరిస్థితుల కార్యాచరణ, కార్యాలయ పరిస్థితులు, తదితర అంశాలపై చర్చించారు. పట్టణ ప్రగతిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రికార్డులను, పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, వందశాతం పన్నులు వసూలు అయ్యేలా సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పన్నులు వసూలు చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లతోనే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపల్ కార్మికుల వేతనాలు, వెహికిల్స్ రిపేర్స్ఇలా ఒకదానికొకటి పన్నుల వసూళ్లతోముడిపడి ఉందని ఈసందర్భంగా ఆయనఅన్నారు.మున్సిపల్ కార్యాలయంలో తిరిగి సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ అభినందించారు.

● తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి అంకిత్ ఆకస్మికంగా సందర్శించారు. వంటశాలలోకి వెళ్లి భోజన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థుల భోజన విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దన్నారు. తమ పిల్లలకు భోజనాలు పెట్టే విధంగా వసతిగృహ విద్యార్థినులు తమ పిల్లలుగా భావించి వార్డెన్లు వారికి నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, కమిషనర్ వెంకట నారాయణ, ప్రిన్సిపాల్ పద్మజ, సంబంధిత శాఖ అధికారులు తదితరులున్నారు.

గురుకుల కళాశాలలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో పరిశోధన పద్ధతులు డేటా విశ్లేషణ, ప్రాజెక్టు నివేదిక అనే అంశంపై కార్యశాల నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక తెలిపారు. పాఠశాలలోని తృతీయ సంవత్సరం విద్యార్థినిలకు ఐపీఈ, ఎంఓయు పరస్పర ఒప్పందంలో భాగంగా పరిశోధనకు సంబంధించిన విషయాలను వివరించారు. భవిష్యత్‌లో పరిశోధన రంగంలో రాణించి నివేదికను ఏలా తయారు చేయాలో అనే అంశాలపై విధివిధానాల గురించి సమగ్రమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐపీఈ విభాగ అధిపతి వై.రామకృష్ణ, డాక్టర్ రాజ్‌కుమార్ పుల్లాయ్, ఎన్.సుజాత, కె.జ్యోతి, వి.సులోచన, సుష్మ, ప్రజ్ఞ, రజనీ, నవ్య, రజిత, తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన

బోధన్‌రూరల్,జనవరి28(ఆంధ్రజ్యోతి): మహిళ శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో, బేటి పడావో 10సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బోధన్ ప్రాజెక్టు ఆచన్‌పల్లి సెక్టార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంగం గ్రామ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నందిని, రాధిక, కొమురమ్మ, డీహెచ్‌ఈడబ్ల్యూ డీఎంసీ స్వప్న, ప్రిన్సిపాల్, పాఠశాల యాజమాన్యం, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

జక్రాన్‌పల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వామనాలు నడపాలని ఎస్సై సీహెచ్.తిరుపతి సూచించారు. మంగళవారం రాత్రి జక్రాన్‌పల్లిలో పోలీసులు, హైవే పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని, రంగ్‌రూట్‌లో వాహనాలు నడపవద్దని, యుటర్న్‌ల వద్ద జాగ్రత్తగా వాహనాలు యుటర్న్ చేయాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జక్రాన్‌పల్లి పోలీసులు, హైవే పోలీసులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా పూజలు





కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక సింధూర పూజలు

రామారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే విధంగా కొందరు వివిధ రకాల పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ గ్రామాల నుండి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. భక్తులు దండా రూపంలో తొమ్మిది వేల ఆరువందల నాలపై ఆరు రూపాయలు (రూ. 9,646/-) భక్తులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహల గుడిదేవుళ్లకు మొక్కలు మొక్కి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయం వెనుక ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో తడిపూజలు నిర్వహించారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా భక్తులు హాజరై కట్నకానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాతో పాటు వివిధ జిల్లాల భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, ఎస్‌ఐ నరేష్, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ , కామారెడ్డి ఎఎంసి డైరెక్టర్ దోమకొండ శ్రీనివాస్ గుప్తా, ఆర్య వైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు గంజి సతీష్ గుప్తా, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వైద్యులు, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట,జనవరి28(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మండలం పాల్దాకు చెందిన ఉల్లెంగ శేఖర్(27)అనే వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మృతుడు శేఖర్ తండ్రి సంజీవ్, సోదరుడు లక్ష్మణ్‌లు గతంలో అప్పులు చేసి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి ప్రస్తుతం అక్కడే ఉన్నారని అన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం శేఖర్ అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడని అన్నారు. తండ్రి, సోదరుడు దుబాయ్ వెళ్లడానికి చేసిన అప్పులతో పాటు ఇంటి నిర్మాణానికి సైతం అప్పులు పెరిగిపోవడంతో అతడు మద్యానికి బానిసయ్యాడని అన్నారు. ఈ నెల 24న రాత్రి తన ఇంట్లో శేఖర్ గుర్తు తెలియని పురుగుల మందును సేవించగా వెంటనే అనిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని అన్నారు. మృతుడి భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోధన్‌రూరల్,జనవరి28(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులో సోమవారం మధ్యాహ్నం రుద్రూరు నుండి వస్తున్న బస్సును ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సచిన్ మల్లికార్జున్(22)మహరాష్ట్రలోని బిలోలి ప్రాంతానికి చెందిన వ్యక్తి సోమవారం జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

విధులకు అటంకం కలిగించిన ఒకరికి జైలు

వేల్పూర్,జనవరి28(ఆంధ్రజ్యోతి):తమ విధులకు అటంకం కలిగించిన మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన పులి సచిన్‌కు నాలుగు రోజు జైలు శిక్ష విధించినట్టు ఎస్సై సంజీవ్ తెలిపారు. సోమవారం రాత్రి సచిన్‌మద్యం తాగిన మైకంలో డయల్ 100 ఏడు సార్లు ఫోన్‌చేసి తన వివరాలు చెప్పకుండా దుర్వినియోగం చేశాడని ఎస్సైతెలిపారు.అందుకు సచిన్‌ను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకొని ఆర్మూర్‌లోని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ నాలుగు రోజుల జైలుశిక్ష విధించారని ఎస్సై సంజీవ్ తెలి పారు.

జాతీయస్థాయికి ఎంపికైన రెంజర్ల పాఠశాల విద్యార్థులు

ముప్కాల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో జరిగిన సౌత్ ఇండియా లెవల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రెంజర్ల పాఠశాలకు చెందిన విద్యార్థి అంకిత జాతీయస్థాయికి ఎంపికైనట్టు ముప్కాల్ ఎంఈవో జక్కుల రవి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని నైపుణ్యం నేర్పిన మల్లేష్, పాఠశాల విద్యార్థిని అంకితను ఎంఈవో రవి, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని వారు అన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రెంజల్,జనవరి28(ఆంధ్రజ్యోతి): రైతుల ముఖాల్లో వెలుగులు నింపేందుకు ఇచ్చిన మాట ప్రకారం రైతు ఖాతాలో రైతు భరోసా కింద డబ్బులు జమ చేసి రైతుల ముఖాల్లో ఆనందాన్ని వెలుగు చూసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు మంగళవారం మండలంలోని నీలా గ్రామంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగా కిషన్, రాంచందర్, సాయిలు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణకు సన్మానం

భీమ్‌గల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంద కృష్ణకు పద్మశ్రీ ప్రకటించడంతో మంగళవారం భీమ్‌గల్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణను మర్యాపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన కలిసిన వారిలో గడాల ప్రసాద్, గట్టు రతన్, దళిత ఐక్య వేదిక నాయకులు ఉన్నారు.

తప్పుల తడకగా నాగాపూర్‌లో రేషన్ కార్డుల పంపిణీ

కమ్మర్‌పల్లి, జనవరి 28: (ఆంధ్రజ్యోతి) గత కొంత కాలంగా రేషన్ కార్డులకోసం ఏదురుచూసిన లబ్ధిదారులు కార్డులు చేతకందగానే సంతోషంగా ఇంటికి చేరారు. కాని ఆకార్డులో బోలేడు తప్పులు ఉండటాన్ని గమనించి హతాసులయ్యారు. కమ్మర్‌పల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా నాగాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఈనెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో మాదిరి కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలోని లబ్ధిదారులకు రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కాగా నాగాపూర్ గ్రామానికి చెందిన 51 మంది లబ్ధిదారులకు కార్డులు మంజూరీకాగా అధికారులు, ప్రజాప్రతినిదులు పంపిణీ చేశారు. అయితే రేషన్ కార్డుల్లో కుటుంబ యాజమానుల పేర్లకు బదులు పిల్లలపేర్లపై కార్డులు మంజూరైన సంఘటనలు చోటుచేసుకున్నాయి కాగా మర్నాడు కొందరు ఆన్‌లైన్‌లో తమకు అందిన ధ్రువీకరణ పత్రాల నెంబర్లు చెక్‌చేసుకోగా ఆనెంబర్లపై వేరేగ్రామాలకు చెందిన లబ్ధిదారుల పేర్లు ఉండడంతో మరింత ఆందోళనకు లోనయ్యారు. విషయంతెలిసిన అధికారులు పరుగో.. పరుగో అంటూ గ్రామానికి చేరుకుని ఆదివారం పంపిణీ చేసిన రేషన్ కార్డుల ధ్రువీకరణ పత్రాలను స్వాధీనంచేసుకుని సవరణ చర్యలు చేపట్టారు.

రేషన్ కార్డుల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుతున్నాము

ఆదివారం నాగాపూర్ గ్రామంలో పంపిణీ చేసిన రేషన్ కార్డుల్లో తప్పులు దొర్లిన విషయం విదితమే అయితే పంపిణీ చేసిన కార్డుల పత్రాలను తిరిగి స్వాధీనం చేసుకుని తిరిగి డాటాఎంట్రి చేపట్టామని మరో రెండు రోజుల్లో తిరిగి లబ్ధిదారులకు అందజేస్తామని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులు వివరణ ఇచ్చారు. మండల గ్రామాల్లో లబ్ధిదారులు రేషన్ కార్డుల్లో తప్పులుదొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

- కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రెంజల్,జనవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన గుల్‌బేగ్ అనారోగ్యానికి గురి కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 18వేల రూపాయల చెక్కును మంగళవారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సాయిరెడ్డి మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, ఖుద్దుస్, శ్రీనివాస్, బాబు నాయక్, సురేష్ పటేల్, చంటి, సద్దాం, అమ్జద్ పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.లక్షా 38వేల మంజూరు అయ్యాయని, వాటికి సంబంధించిన చెక్కులను లబ్దిదారులకు అందజేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, ఎడపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంజ కామప్ప, మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, నాయకులు మచ్కూరి గంగాధర్, రత్నాకర్, జక్కలి నాగేష్, ప్రతాప్ రెడ్డి, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

బయో మైనింగ్ ప్రాసెసింగ్ పరిశీలన

బోధన్‌రూరల్,జనవరి28(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని డంపింగ్ యార్డులో గల బయో మైనింగ్ ప్రాసెసింగ్‌ను మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, కమిషనర్ వెంకట రమణ, డీఈ విఘ్నేష్ పరిశీలించారు. ఈసందర్భంగా డంపింగ్ యార్డు పరిసరాలను పరిశీలించి డంపింగ్ యార్డు యొక్క పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులున్నారు.

అనుమతి లేకుండా అక్రమ మజీదు నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి

ఎడపల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అనుమతి లేకుండా అక్రమంగా కడుతున్న మజీదు నిర్మాణాన్ని ఆపి వేయాలని కోరుతూ మంగళవారం కాలనీ వాసులు, హిందూ వాహిని, బిజేపి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఇండ్ల మధ్య అనుమతి లేకుండా కొందరు మజీదునిర్మాణం చేపడుతున్నారని అట్టి నిర్మాణాన్ని అపాలంటూ ఎడపల్లి పోలీసులకు, జీపీ కార్యదర్శి నాగరాజు గౌడ్‌కు, ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌కు వినతిపత్రం అందించినట్లు వారు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఇందిరమ్మ కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలో ఫీజులను నియంత్రించాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టరాజ్యంగా ఫీజులు వసూలు చేయడాన్ని నియంత్రించాలని కోరుతూ మంగళవారం ఎంఈవో రాజగంగారాంకు టీఎన్‌వీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ నవ నిర్మాణ్ విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్‌నాయక్, దిలిప్, సాయికిశోర్, వికాస్, ఆదిత్యలు కోరారు.

ఆర్గానిక్ సాగును పరిశీలించిన విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సహజ పద్ధతిలో సాగు చేస్తున్న చెరుకు, పండ్ల చెట్లు, కూరగాయలు మొదలైన ఆర్గానిక్ సాగు పద్ధతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పరిశీలించారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్, పెర్కిట్ జడ్పీహెచ్ఎస్, ఆర్మూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కలిసి పెద్దోళ్ల గంగారెడ్డి ఇంటి ఆవరణలో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తున్న చెరుకు, పండ్ల చెట్లు, కూరగాయలను, తదితర పంట సాగు విధానాన్ని తెలుసుకున్నారు. చెరుకు రసాన్ని తీసి సహజ సిద్ధంగా బెల్లంను తయారు చేసే విధానాన్ని గంగారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, డి.రవీందర్, ఉపాధ్యాయులు గంగనర్సయ్య, లింబాద్రి, పోశన్న, రాజ్‌కుమార్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

ఆర్మూర్‌రూరల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని కేజీబీవీ పాఠశాల విద్యార్థిని శరణ్య రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేక అధికారిణి గంగామణి తెలిపారు. ఇటీవల సుద్దపల్లిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 సాఫ్ట్‌బాల్ ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈనెల 29నుంచి మెదక్ జిల్లా తుప్రాన్‌లో జరగనున్న 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో శరణ్య పాల్గొంటుందన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కుల గణన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి

మెండోర, జనవరి28(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన 2024నిర్వహించిన ఉపాధ్యాయులకు రావల్సిన రెమ్యూనరేషన్ వెంటనే తమ వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహించి నెలలు గడుస్తున్న రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం సరికాదని, సర్వే చేసిన ఉపాధ్యాయులకు సీపీఎల్‌లు వెంటనే మంజూరు చేయాలని తెలిపారు.

జక్రాన్‌పల్లిలో అభివృద్ధి కోసం నిధుల మంజూరు

జక్రాన్‌పల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి జక్రాన్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు రూ.12కోట్ల నిధులను మంజూరు చేయించారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జైడి చిన్నారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్‌రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరివినోద్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవికుమార్, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి వసంత్ రావు, మండల మైనారిటీ అధ్యక్షుడు అక్బర్, మాజీ సర్పంచ్‌లు కాట్‌పల్లి నర్సా రెడ్డి, కిషన్‌నాయక్, మాజీఎంపీటీసీ గంగారెడ్డి, మాజీవైస్ఎంపీపీ జితేందర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు బొండ్ల అరుణ్, శ్రీధర్, జైడి మల్లేష్, పురుషోత్తం, లక్ష్మణ్, జైడి మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

రాజంపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లాపరిషత్, కేజీబీవీ పాఠశాలలను మంగళవారం డీఈవో రాజు పరిశీలించారు.ఈ సందర్భంగా మధ్యాహ్నభోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వహకులకు సూచించారు. అదేవిధంగా పాఠశాలలోని విద్యార్థుల అపార్‌కార్డుల రిజిస్ట్రేషన్ పరిశీలించి నమోదు వేగవంతం చేయాలని తెలిపారు. పదోతరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకోసం మోటివేషన్ చేయాలని ప్రతిరోజు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో పూర్ణచందర్ రావు, ఏసీజీఈ అధికారి బలరాంనాయక్,సీఆర్‌పీలు పాల్గొన్నారు.

భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

భిక్కనూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు తమ న్యాయమైనా డిమాండ్‌లను నేరవేర్చాలని కోరుతూ మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కాంట్రాక్టు అధ్యాపకులను విస్మరించడం బాధకరమని, విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్టు అధ్యాపకులకు ఇచ్చిన మహీ మేరకు వెంటనే బేసిక్, హెఆర్‌ఏ, డీఏతో కూడిన వేతనాన్ని చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు నారాయణ, సునీత, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, నిరంజన్‌శర్మ, వైశాలీ, సరిత, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

నాగిరెడ్డిపేట,జనవరి 28(ఆంధ్రజ్యోతి):జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించాలని,బాల్యవివాహాల వల్లజరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని జిల్లా సఖీ కేంద్రం అధికారిని భారతి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సఖి కేంద్రం సిబ్బంది గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసి వివిధఅంశాలపై వారికి అవగాహన కల్పించారు.బాల్యవివాహాల నిర్మూలన, గర్భలింగ నిర్ధారణ, నిషేధ చట్టం, ఫోక్సో చట్టం, మహిళా చట్టాలపైన మహిళలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో స్థానిక డాక్టర్ సృజన్‌కుమార్, డిస్ట్రిక్‌మిషన్ కోఆర్డినేటర్‌శిరీష,సఖీసెంటర్ అడ్మినిస్ట్రేటర్ సాయవ్వ,హెల్త్‌సూపర్ వైజర్‌లు,ఎఎన్ఎంలు,ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

లింగంపేట,జనవరి 28:(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్‌తో పాటు మండలంలోని పలు గ్రామాలలో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కలిసారు. మండలంలో కొన్ని భూ సమస్యలు సైతం పరిష్కారం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్,రాజు,ప్రసాద్‌గౌడ్,పూల్‌సింగ్, గోపాల్, రాజేశ్వర్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

సెల్‌టవర్ పనులను నిలిపివేయాలని ధర్నా

భీమ్‌గల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని సాయిరాంనగర్ వివేకానందకాలనీలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌టెల్ లవర్ పనులను నిలిపివేయాలని కాలనీవాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ట్రమ్ నిబంధనలకు విరుద్ధంగా జనవాసాల మధ్య ఏలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, దీంతో భవిష్యత్‌లో ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, గత ఏడాది తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులు

గురుకులం పిలుస్తోంది

- పేద, మధ్య తరగతి విద్యార్థులకు కల్పతరువుగా గురుకుల పాఠశాలలు
- ఫిబ్రవరి 1 వరకు ప్రవేశ దరఖాస్తులకు అవకాశం
- పాఠశాలల్లో నాణ్యమైన చదువు, సౌకర్యాలపై ఉపాధ్యాయుల ప్రచారం
- దరఖాస్తుల స్వీకరణకు మిగిలింది మరికొద్ది రోజులే..

మద్నూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకులాలు విద్యా వికాసానికి కల్పతరువుగా మారాయి. పేదింటి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నాయి. నాణ్యమైన విద్య, సన్నబియ్యంతో భోజనం, కాస్మెటిక్స్ ఉచిత దుస్తులు, బెడ్‌షిట్స్, పుస్తకాలతోపాటు క్రీడా సాంస్కృతిక రంగాల్లో అకాడమీల ద్వారా శిక్షణ అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశాన్ని అందిపుచ్చుకుంటే సర్వతోముఖాభివృద్ధికి చెందేందుకు మంచి భవిష్యత్తు నిర్మించుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. 5వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఉచిత చదువు, హాస్టల్ సౌకర్యాలు కల్పిస్తున్నాయి. గురుకుల విద్యార్థులకు తరగతుల ఆధారంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు తదితర ఇంటర్ రికార్డు పుస్తకాల వరకుపూర్తిగా ప్రభుత్వమే అందజేస్తోంది.

• ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎస్సీ, ఎస్టీ, బీసీ తెలంగాణ రెసిడెన్షియల్ గురుకులాలు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. గురుకులాల ఉపాధ్యాయ బృందం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కలిసి గురుకులాల గురించి వివరిస్తున్నారు. గురుకులాల్లో చేరి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచిస్తున్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులు జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతూ ఉండాలి. ఇందుకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఈ ఏడాది నుంచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ముందే సమర్పించి దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రులు వారికి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలకు మించి ఉండొద్దు. ఫిబ్రవరి 1వ తేది వరకు దరఖాస్తులకు అవకాశం ఉందని గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నారు.



గురుకులంలో చేరాలని పాఠశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి: షబ్బీర్

కామారెడ్డిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తుందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం బీసీసంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు పెద్దపీట వేయాలని ఆలోచన చేస్తుందని తెలిపారు. బీసీలు రాజకీయంగా,ఆర్థికంగా ఎదిగేందుకు మరిన్ని అవకాశాలు కల్పించేలా ప్రభుత్వంచర్యలు చేపడుతుందన్నారు. బీసీ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు సాపశివరాములు, విద్యార్థి సంఘం అధ్యక్షుడు నీలనాగరాజు, బీసీ యువజనసంఘం అధ్యక్షుడు ఐరేనీ సందీప్, మాజీ కౌన్సిలర్ వంశీ,జిల్లా ఉపాధ్యాక్షుడు మోహన్‌చారి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న షబ్బీర్‌అలీ

భక్తుల కొంగుబంగారం అల్లమ ప్రభు



- అమావాస్య రోజు ప్రతిష్ఠించిన ఆత్మలింగం
- నేటి నుంచి అల్లమా ప్రభు జాతర
- మూడు రోజులు కొనసాగనున్న జాతర
- కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తుల రాక
- జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు

నసురుల్లాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చేవాడు.. భక్తుల కొంగు బంగారం అల్లమ ప్రభు అని ఇక్కడ భక్తుల నమ్మకం. ధర్మం నశించి పాపం పెరిగినప్పుడు ధర్మజాగృతికి మహాపురుషులు ఈ జగత్తున ఉద్భవిస్తారని, అల్లమా ప్రభు కూడా మానవాళికి మార్గదర్శనం చేసేందుకు శివ పరమాత్ముని రూపంతో భూమిపై జన్మించాడని ఇక్కడి భక్తుల విశ్వాసం. కర్ణాటకలోని శివ మొగ్గ జిల్లా షికారిపురి తాలూకాలోని బల్లిగావి అల్లమప్రభు జన్మస్థలం. సజ్జనీదేవి, నిరాహంకరుడు అతని తల్లిదండ్రులు. అల్లమ ప్రభుని గురువు అనిమషుడు. తన గురువు ద్వారా పొందిన ఆత్మలింగాన్ని తీసుకొని దేశ సంచారం చేస్తూ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలోని కొండపై లింగాన్ని మాఘమాసంలోని అమావాస్య రోజు ప్రతిష్ఠించారు. ఈ కొండ అల్లమ ప్రభు కొండగా పేరుగాంచింది. జాతర గ్రామంలో 3 రోజులు అంగరంగ వైభవంగా జరగనుంది. 29న బుధవారం అగ్నిగుండం, అన్నదానం, గురువారం రథోత్స వం, నిండు జాతర, శుక్రవారం కుస్తీపోటీలు జరగనున్నాయి.



అల్లమ ప్రభు ఆలయం

దళిత వర్గానికి చెందినవారే పూజారి

పూర్వం దళితులు ఆలయంలోనికి వస్తే అడ్డుకునేవారు. కానీ ఈ ఆలయంలో మాత్రం కొండపై శివాలయం ఏర్పడిన నాటి నుంచి దళితవర్గానికి చెందినవారే పూజారిగా కొన సాగడం విశేషం. ఆలయానికి ప్రస్తుతం అనిత, రామవ్వ అనే మహిళలు పూజారులుగా కొనసాగుతున్నారు.

ఎప్పటికీ ఎండని నీటి కుంట

అల్లమ ప్రభు మహిమతో అన్ని కాలాల్లో కూడా కొండపైకి వెళ్లేదారిలో నీటికుంటలో నీరు ఎండిపోకుండా ఉంటుంది. ఈ నీటిని తీసుకొని కొండపై గల ఆత్మ లింగాన్ని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అల్లముని శిష్యులైన బసవన్న సిద్ధప్పలు దీనిపై ప్రచారం చేశారు. ఈ నీరు లభించే ప్రాంతాన్ని సిద్దన్న పేరు మీదుగా అక్కడే బసవన్నను కూడా ఇప్పటికీ భక్తులు పూజిస్తారు.

పలు రాష్ట్రాల నుంచి భక్తుల రాక

అల్లమప్రభు ఆలయాన్ని దర్శించుకోవడానికి కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. దీంతో గ్రామం సందడిగా మారుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు.



వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుంటారు

• జంగం అనిత, ఆలయ పూజారి

తరతరాలుగా చాలా సంఖ్యలో ఆలయానికి వచ్చి అల్లమా ప్రభువుని దర్శించుకోవడానికి భక్తులు హాజరవుతారు. ఆయనకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు

• నీరడి ప్రశాంత్, బొమ్మన్‌దేవ్‌పల్లి



స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. దీంతో ఆలయ ప్రాంగణం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామం సందడిగా ఉంటుంది.



జాతరకు ముస్తాబైన ఆలయం

భూమి కబ్జా చేసిన

నిందితుడిపై చర్య తీసుకోవాలి

- రామారెడ్డి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన రైతులు

రామారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ అండదండలతో వంద ఎకరాల పంట భూమిని కబ్జా చేసుకున్న నిందితుడిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం రామారెడ్డి మండల తహసీల్దార్ కార్యాలయం వద్దకు భారీ సంఖ్యలో రైతులు తరలివచ్చారు. రామారెడ్డి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఇసన్నపల్లి గ్రామ శివారులో ఉన్న వంద ఎకరాల పంట భూమిని గ్రామానికి చెందిన లింబాద్రి, తమ్ముడు కలిసి రైతుల భూమిని ఇతరులకు అమ్ముకుంటున్నాడని భారీ సంఖ్యలో రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్సై నరేష్ నేతృత్వంలో పోలీసులు తహసీల్దార్ కార్యాలయం ముందు చేరుకొని రైతులతో మాట్లాడి బాధితులు తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికాంత్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వ్యవసాయ భూమి సర్వే నెంబర్ 41, 42 సంబంధించి పట్టాదారులు కబ్జాచేసిన నిందితునిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో ధర్ని మల్లయ్య, ధర్ని వీరమల్లు అనిల్, శ్రీకాంత్, భైరయ్య, సుజాత, మహేష్, గంగయ్య, నాగ భూమయ్య, మల్లయ్య ఉన్నారు.



ఆర్‌ఐకి వినతిపత్రాన్ని అందజేసిన రైతులు



ముస్తాబైన ఆలయ ముఖద్వారం, గర్భగుడిలో రాజరాజేశ్వర స్వామి విగ్రహం

నేటి నుంచి రామన్నపేట్ అయ్యలగుట్ట

మహాజాతర ఉత్సవాలు

వేల్పూర్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం రామన్నపేట్ పరిసర ప్రాంతాల ఆరాధ్యదైవమైన శ్రీ అయ్యలగుట్ట రాజరాజేశ్వరస్వామి జాతర మహోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మాఘఅమవాస్య నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు, జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కమిటీ సభ్యులు కోరారు. అయ్యలగుట్ట చుట్టూ స్వామివారి చిన్న శావా, పల్లకీసేవ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, రాత్రికి పెద్ద శావా వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు శ్రీరాంపూర్‌లో చిలుకల చిన్నమ్మ జాతర

ముప్కాల్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామంలో ప్రసిద్ధ చిలుకల చిన్నమ్మ జాతరను నేడు బుధవారం నిర్వహించనున్నారు. ప్రతీఏటా మాఘమాస అమవాస్య రోజున నిర్వహిస్తారు. బుధవారం శ్రీరాంపూర్ గ్రామంలో జరిగే జాతరకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లుచేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సుందరగా తీర్చిదిద్దారు. జాతర సందర్భంగా పవిత్ర గంగజలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలను నిర్వహించి చిలుకల చిన్నమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల కోసం ఆలయ ఆవరణలో చాలువ పందిళ్లు వేసినట్టు తెలిపారు.

పంచాయతీ భవనాలకు

మోక్షమెన్నడో?



శిథిలావస్థకు చేరిన కొత్తపల్లి పంచాయతీ భవనం

- శిథిలావస్థలో పంచాయతీ భవనాలు
- ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె భవనాలే దిక్కవుతున్న వైనం

కోటగిరి, జనవరి28 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన, పరిపాలన దృష్ట్యా ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసినా అందుకు తగ్గ వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదు. గ్రామస్థాయిలో పాలన కేంద్రమైన పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేక నానాఅవస్థలు పడాల్సివస్తోంది. పలుచోట్ల అద్దె భవనాలు, సామాజిక కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం కూర్చునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీ సమావేశాలు వరండాలు, పాఠశాల ఆవరణలో నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల భవనాల నిర్మాణం పూర్తి చేసుకున్నా ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.

కోటగిరి ఉమ్మడి మండల పపరిధిలో టాక్లి, వల్లాబాపూర్, చేతన్‌నగర్, హంగర్గఫారం, జల్లాపల్లి అబాధి, దేవునిగుట్ట తండా, అడ్కస్‌పల్లి, సుద్దులం తాండలు నూతన పంచాయతీలుగా 2018లో ఏర్పడ్డాయి. ఏడేళ్లు దాటినా ఇంతవరకు సగానికి పైగా పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడం గమన్నారం.

• ప్రైవేటు భవనాలే దిక్కు

అప్పట్లో హడావుడిగా పంచాయతీ కార్యాలయాలను నిర్వహించేందుకు సామాజిక భవనాలు, ప్రైవేటు భవనాల్లో ఏర్పాటు చేశారు. నేటికి వాటిలోనే పంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇరుకైన గదుల్లోనే కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు మండల పరిదిలో కొత్తపల్లి, హంగర్గ, జల్లాపల్లి ఫారం భవనాలు శిథిలావస్థకు చేరాయి. గత ప్రభుత్వ హయంలో కొత్తగా ఏర్పడిన హంగర్గఫారం, జల్లాపల్లి అబాది, దేవునిగుట్ట తండా, అడ్కస్‌పల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుచేశారు. దేవునిగుట్ట తండా పంచాయతీ భవనం నిర్మించి ఏడాదికావస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. అడ్కస్‌పల్లి గ్రామంలోనూ రూ.20లక్షల వ్యయంతో భవనం నిర్మించిన నిధుల కొరతతో అసంపూర్తిగా మిగిలింది. టాక్లి, వల్లాభాపూర్, చేతన్ నగర్, సుద్దులం తండా గ్రామాల్లో గ్రామ పంచాయతీల భవనాలు కరువయ్యాయి.

• కొత్తపల్లిలో శిథిలావస్థకు చేరిన భవనం

కొత్తపల్లి గ్రామ పంచాయతీ భవనం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరింది. ఆరేళ్ల క్రితం ఈ గ్రామం నుంచి దేవునిగుట్ట తాండ గ్రామం పంచాయతీగా ఏర్పడింది. కొత్త గ్రామపంచాయతీలో భవనం నిర్మించిన ప్రారంభానికి నోచుకోలేదు. కొత్తపల్లి పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వాల హయంలో రెండుసార్లు నిదులు మంజూరయ్యాయి. ఓసారి మంజూరైన నిదులతో భవనం పనులు ప్రారంభించారు. పిల్లర్ల వరకు పనులు పూర్తిచేసి అసంపూర్తిగా వదిలివేశారు. మరోమారు రూ.5లక్షలు మంజూరైతే మరోచోట స్లాబ్‌వేసి సగం భవనం నిర్మించి కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో పంచాయతీ భవనం నిర్మాణం కలగానే మారింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరినభవనంలో విధులు నిర్వహించాలంటే పంచాయతీ సిబ్బంది జంకుతున్నారు.

ఉమ్మడి మండలంలో కొత్తగా మరో 8 జీపీలు

కోటగిరి ఉమ్మడి మండలంలో కొత్తగా మరో 8 గ్రామపంచాయతీలను ఏర్పాటుచేశారు. సోంపూర్ గ్రామం నుంచి రాంగంగానగర్‌ను, హెగ్డోలి నుంచి బాకర్ ఫారం, పోతంగల్ నుంచి తిర్మలాపూర్, జల్లాపల్లి ఫారం నుంచి జల్లాపల్లి తాండ, జల్లాపల్లి, లింగాపూర్ గ్రామం నుంచి గన్నారం(పిఎస్ఆర్ కాలనీ), ఎక్లాస్‌పూర్ నుంచి ఎక్లాస్‌పూర్ క్యాంప్, ఎత్తోండ నుంచి ఎత్తోండ క్యాంప్‌లను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే కొత్తగా మరో ఎనిమిది జీపిలలో పాలకవర్గం ఏర్పడనుంది. ఎనిమిది జీపిల్లో ఒకే ఒక్క గ్రామానికి పంచాయతీ భవనం ఉంది. మిగిలిన ఏడు గ్రామాల్లోను అద్దె భవనాలే ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



ప్రారంభానికి నోచుకోని దేవునిగుట్ట తండా పంచాయతీ భవనం



నిధుల కొరతతో అసంపూర్తిగా మిగిలిన భవనం

కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపుతాం

• శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ, కోటగిరి



ఆరేళ్ల క్రితం ఏర్పడిన పంచాయతీల్లో సగానికి పైగా పంచాయతీ భవనాలు నిర్మించారు. నిదుల కొరతతో అడ్కస్‌పల్లి భవనం అసంపూర్తిగా మిగిలింది. దేవునిగుట్ట తాండ పంచాయతీ భవనం ప్రారంబించేందుకు చర్యలు తీసుకుంటాము. ఆయా గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపిస్తాం.


బీర్కూర్‌లో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బీర్కూర్‌లో కంటి వైద్య శిబిరం

బీర్కూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో లయన్స్ డాక్టర్ సందీప్ 38మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. నలుగురికి మోతి బిందు ఉన్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్స నిమిత్తం బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు గాలయ్య, లయన్స్ సభ్యులు విఠల్, రమేష్, సంతోష్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ పీహెచ్‌సీలో మహిళా ఆరోగ్య శిబిరం

బీర్కూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. వైద్యురాలు శ్రీలేఖ మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. 30ఏళ్ల పై బడిన మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్య పరీక్షల్లో గుర్తించి తగిన వైద్యం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రవీందర్, సూపర్ వైజర్లు సుశీల, నర్సమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నసురుల్లాబాద్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నసురుల్లాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయకృష్ణ కాలనీలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్ మాట్లాడుతూ రూ.ఏడు లక్షలతో ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో సీసీ రోడ్డు పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాయాగౌడ్, మామిడి భూమయ్య, పయాజ్, చౌదరి, అజగర్, అలీ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి : ఎంఈవో

పెద్ద కొడప్‌గల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని విఠల్‌వాడీ, లింగంపల్లి, బాబల్‌గాం గ్రామాల్లో గల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులు ఎక్కువగా ఉంటున్నందున వారికి అర్థమయ్యేరీతిలో విద్యను బోధించాలని సూచించారు. మధ్యాహ్నభోజన ఏజన్సీలు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాబల్‌గాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగం, సీఆర్‌పీలు గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న ఉపాధ్యాయులు

మధ్యాహ్న భోజనాన్ని వడ్డించిన ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు ఒక రోజు సమ్మెలో ఉండటంతో ఎల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం తయారు చేసి విద్యార్థులకు పెట్టారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లాల్‌సింగ్, ఉపాధ్యాయులు యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నేటి మాఘమ అమావాస్యకు ముస్తాబైన

మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం


శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం

రామారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామ అడవి ప్రాంతంలో వెలిసిన స్వయంభూ శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం బుధవారం మాఘమాస్య సందర్భంగా ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు పలు ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి జిల్లాతో పాటు నిజామాబాద్, రాజన్న, సిరిసిల్ల, మెదక్, సంగారెడ్డి, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే ందుకు పలు ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి కొత్త బస్టాండ్ ఉంది. ఆర్టీసీ బస్సులో రాక కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఆలయం ఆవరణలో కోనేరు వద్ద స్నానాలు చేసేందుకు భక్తులకు ఇలాంటి ఇబ్బ ందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయం వద్ద పుష్కలంగా స్నానాలు చేసేందుకు కోనేరును ప్రత్యేక పూజలు చేసుకునేందుకు అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రత్యేక పురోహితులు జంగం ప్రభాకర్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై పండుగ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు.

పోచారం ప్రాజెక్టు ద్వారా రబీ సాగుకు రెండో విడత నీటి విడుదల

నాగిరెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ జోన్‌కు చెందిన రబీ పంటల సాగు కోసం మంగళవారం పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటి పారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. పోచారం ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1464 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1460.68 అడుగులు (1.305 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రస్తుత రబీ సీజన్‌లో పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటిని నాగిరెడ్డిపేట మండలంలోని ఏ జోన్‌కు చెందిన 6,500 ఎకరాల సాగు భూములకు అందజేస్తున్నారు. జనవరి 4న మొదటి విడత నీటిని పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ విడుదల చేయగా, 15 రోజుల పాటు నీటిని విడుదల చేసి 10 రోజుల పాటు నీటిని నీటి పారుదల శాఖ అధికారులు నిలుపుదల చేశారు. ప్రస్తుతం మంగళవారం నాడు రెండో విడత నీటిని ప్రాజెక్టు ప్రధాన ద్వారం 180 క్యూసెక్కుల నీటిని నీటి పారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. రబీ సాగు కోసం ప్రాజెక్టు నీటిని నాలుగు విడతల్లో విడుదల చేయాల్సి ఉండగా ప్రస్తుతం రెండో విడత నీటి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు, నాగిరెడ్డిపేట ఏఈ అక్షయ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మల్లుపల్లిలో నారాయణ అంత్యక్రియలు పూర్తి

● మల్లుపల్లి, రామేశ్వర్‌పల్లిలో పోలీసుల భారీ బందోబస్తు

భిక్కనూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన మాలే నారాయణ(43) సంగారెడ్డి జిల్లాలో హత్యకు గురైన నేపథ్యంలో మల్లుపల్లితో పాటుగా ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాకేష్ స్వగ్రామం మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్లితే.. నారాయణ అంత్యక్రియలు పూర్తి కాగానే మృతదేహాన్ని గ్రామస్థులు, ఆయన కుటుంబ సభ్యులు నిందితుడు రాకేష్ ఇంటి వద్దకు తీసుకెళ్లాలని నిర్ణయానికి రాగా ఈ విషయం తెలిసిన పోలీసులు భిక్కనూరు సీఐ సంపత్ నేతృత్వంలో భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు, దోమకొండ ఎస్సై సర్వరాజ్ మల్లుపల్లితో పాటుగా రామేశ్వర్‌పల్లి గ్రామంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసి గ్రామస్థులకు నచ్చజెప్పి మృతదేహాన్ని మల్లుపల్లికి తరలించారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలను సజావుగా నిర్వహించాలని మృతుడి బంధువులను, గ్రామపెద్దలకు పోలీసులు సూచించగా మృతుడి పిల్లలకు న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో ఇరుగ్రామాల పెద్దల సహకారంతో మృతుడి పిల్లలకు న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో నారాయణ అంత్యక్రియలను బంధువులు సాయంత్రం నిర్వహించారు. నారాయణ అంత్యక్రియల్లో గ్రామస్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

అధికారుల అదుపులో ఇసుక డంపు

నసురుల్లాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కూతవేటు దూరంలో గల క్రషర్ వద్ద ఇసుక డంప్ ఉండంతో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లబ్ధిదారులు వచ్చి సరైన ఆధారాలు చూపితే ఇసుక డంప్‌ను వదిలేస్తామని ఆయన అన్నారు. ఇసుక డంప్‌ను అధికారులు సమీకృత భవనానికి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా మండల కేంద్రానికి చెందిన వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్లకు బెదిరింపులకు గురి చేసి ఎటువంటి వాహనాలు రాకుండా చేశాడని సమాచారం. అధికారులు న్యాయమైన విచారణ జరిపి లబ్ధిదారులకు మాత్రమే ఇసుకను అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు. సామాన్యునికి ఒక ట్రిప్ ట్రాక్టర్ దొరకాలంటే గగనమైన ఈ సమయంలో ఇసుక మాఫియాగా పేరొందిన మండల కేంద్రానికి చెందిన వ్యక్తికి మూడు టిప్పర్ల ఇసుక డంప్‌గా ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఉమ్మడి బీర్కూర్ మండలంలోని ఇసుకాసురునిగా పేరుందిన ఆ వ్యక్తి పలువురిని బయాందోళనకు గురి చేస్తూ ఇసుక వ్యాపారం సాగిస్తున్నాడంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల అదుపులో ఉన్న ఇసుక సుమారు 20 ట్రిప్పుల వరకు ఉండవచ్చని అంచనా. అయితే ఇసక సీజ్ చేసినట్లు పోలీసులకు సమాచారం అందించామని గిర్దావర్ సాయిలు పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కి ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మూడు ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చామని, మిగతా సీజ్ చేసిన ఇసుక డంప్‌ను ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి వేలం నిర్వహిస్తామన్నారు.

యోగా భవన్‌లో సూర్యనమస్కార పోటీలు

కామారెడ్డి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో సూర్యనమస్కారాల పోటీలు నిర్వహించినట్లు యోగా గురువు రాంరెడ్డి తెలిపారు. మహిళ విభాగంలో హిమబిందు, సంధ్య, పురుషుల విభాగంలో అంజయ్య, బాపిరెడ్డి, కుంబాల ఎల్లయ్య, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, అజయ్, రాజ్‌కుమార్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. వీరికి బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.


సూర్య నమస్కారాల పోటీల్లో పాల్గొన్న యోగ సాధకులు

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి


బోర్లంలో నిరసన వ్యక్తం చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

బాన్సువాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో గణతంత్ర దినోత్సవం రోజు దేశ ప్రజలకు దశాదిశ చూపిన అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం మూర్ఖుల చర్య అని అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద చౌరస్తాలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి నల్లోళ్ల సాయిలు మన్నె అనిల్ కుమార్ బాన్సువాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నెరై నర్సింలు, అంబేద్కర్ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు మన్నె చిన్న సాయిలు అంబేద్కర్ సంఘం నాయకులు ఎర్రోళ్ల సాయిలు, బేగరి డాక్టర్ సాయిలు, మన్నే ఐకేపీ సాయిలు, బేగరి కొత్తపల్లి సాయిలు, గుజ్జరి గంగారాం, పోతురాజు సాయిలు, జగ్గా ఆనంద్ కుమార్, బేగరి బాలయ్య గ్రామ అంబేద్కర్ సంఘ సభ్యులు బేగరి సెంట్రింగ్ సాయిలు, చిలుక కాశీరం, బేగరి శ్రీను, బేగరి నర్సింలు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్ గురించి అవహేళనగా మాట్లాడారని, అదే అదనుగా చూసుకుని సామాన్యులు కూడా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏజాస్, ప్రశాంత్, రాజు, షైశయ్య, హకీం, వినోద్, సంఘ సభ్యులు తదితరులున్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ మాజిద్

రామారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని రామారెడ్డి మండలం మోశంపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ మాజిద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులందరూ తమ, తమ పశువులకు ఎద లక్షణాలు గమనించి సరియైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించి తద్వారా మేలు జాతి దూడలను పొందాలని సూచించారు. ప్రస్తుతం కచ్చితంగా ఆడదూడ పుట్టే విధముగా అభివృద్ధి పరిచిన వీర్య నాలికలు మా వద్ద అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకొని ఖచ్చితంగా ఆడదుడా పుట్టే విధంగా చేసుకోవచ్చని సూచించారు. రామారెడ్డి మండల పశు వైద్య అధికారి డాక్టర్ రామచందర్ నేతృత్వంలో చూడి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 40 సాధారణ చికిత్సలు, 51 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 1 కృత్రిమ గర్భధారణ, 22దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు, వి ఎల్ వో నారాయణ, జేవీవో ఆంజనేయులు, గోపాలమిత్ర సూపర్ వైజర్ కృష్ణ, గోపాలమిత్ర హారిక, గ్రామ పాడి రైతులు రాజిరెడ్డి, రాములు, అనిల్ రెడ్డి, రాజు, భూమయ్య, సంతోష్ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

పెద్ద కొడప్‌గల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలం గుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. సోమవారం రాత్రి బోధన్ నుంచి సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలానికి ఇసుక తీసుకుని వస్తుండగా బేగంపూర్ చౌరస్తాలో పట్టుకుని టిప్పర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేయడం నేరమని, ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో సోమవారం రాత్రి పేకాట కేంద్రంపై దాడి చేసి 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి 8 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ.24,380 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్లు దుకాణంలో న్యూసెన్స్ చేస్తున్నారని ఫిర్యాదు

ఎల్లారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణంలోని 6వ వార్డులో కాలనీవాసులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ మేనేజర్ వాసంతికి ఫిర్యాదు చేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ 6వ వార్డులో 1వ నెంబర్ కల్లు దుకాణంకు వచ్చే వారు కాలనీలోకి ప్రజలు వెళ్లకుండా రోడ్డుపైన వాహనాలు, ఆటోలను నిలుపుతూ కల్లు తాగిన మైకంలో న్యూసెన్స్ సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై చర్యలు చేపట్టాలని వారు కోరారు.

లింగారెడ్డిపేట్‌లో వ్యక్తి అదృశ్యం


షేక్ అహ్మద్ (ఫైల్)

ఎల్లారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట్‌కు చెందిన బేగారి పావులవ్వ భర్త అయిన షేక్ అహ్మద్(47) ఎల్లారెడ్డిలో మాంసాన్ని విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. షేక్ అహ్మద్ గత ఐదు సంవత్సరాల నుంచి తన మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. ఈనెల 24న ఉదయం 11 గంటలకు షేక్ అహ్మద్ బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదని షేక్ అహ్మద్ భార్య పావులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎల్లారెడ్డి ఎస్‌ఐమహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా ఆచూకి తెలిస్తే ఎల్లారెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన

యూపీఎస్ విధానానికి వ్యతిరరేకంగా ఉద్యోగుల నిరసన

ఎల్లారెడ్డి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్థానంలో కేంద్రం తెస్తున్న యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం టీఎస్సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ముందు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎల్లారెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని తీసివేస్తూ 1ఏప్రిల్ 2025 నుంచి యూపీఎస్ విధానాన్ని తేవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చరణ్‌సింగ్, వాణి శ్రీకాంత్, లావణ్య, సరిత, వెంకట లక్ష్మీ, రాజు తదితరులు ఉన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో రాజు

డిజిటల్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీఐటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే డిజిటల్ యాత్ర వాల్ పోస్టర్లను మంగళవారం డీఈవో రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఐటీ కంపెనీలో పనిచేసే ఉద్యోగులతో ఈ శిక్షణను అందించేందుకు టీఐటీఏ ముందుకు రావడం అభినందించదగిన విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఐటీఏ సెక్రటరీ శ్రీకాంత్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, డేవిడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల గుర్తింపు

కామారెడ్డి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని ఆర్‌బీనగర్ కాలనీలో మంగళవారం విద్యాశాఖ సిబ్బంది బడిబయట పిల్లలను గుర్తించి స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30 వరకు బడిబయట చదువుతున్న పిల్లలను గుర్తించనున్నట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులకు చదువును అందేలా చూస్తే కలిగే ప్రయోజనాలు వివరించి పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, సీఆర్‌పీలు, చిరంజీవి, బాలయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేల అందజేత


ఆర్థిక సహాయం అందిస్తున్న తిరుపతిరెడ్డి

మాచారెడ్డి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పల్వంచ జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలకు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఈ తిరుపతిరెడ్డి అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్ శిక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన ల్యాబ్‌కు అవసరమైన ఇన్వర్టర్ కోసం రూ.50వేలు అందించినట్లు తెలిపారు.

ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

● జడ్పీ సీఈవో చందర్‌నాయక్

నసురుల్లాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో చందర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి రూ.కోటి నలభై ఒక లక్ష నిధులు కేటాయించామన్నారు భవన నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. అనంతరం మండల అభివృద్ధి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండల అభివృద్ధి కార్యాలయం సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అని ఇంచార్జి ఎంపీడీవో సూర్యకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో, మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది పరిషత్ కార్యాలయంలో సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ తదితరులు ఉన్నారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	సంక్రాంతికి వస్తున్నాం
దర్శన్	పుష్ప-2
ప్రియా 70	డాకు మహారాజ్
ప్రియా 35	గేమ్ చేంజర్

బాన్సువాడ

మహేశ్వరి	సంక్రాంతికి వస్తున్నాం
వెంకటేశ్వర	డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	140	160
వెన్‌కాబ్(కిలో)	130	160	190

